క్లుప్తంగా

ఆయుష్మాన్ భారత్ కార్డులు అందజేత



కార్డులను అందజేస్తున్న నర్సింహ యాదవ్

కేశంపేట: మండల పరిధిలోని తొమ్మిదిరేకుల గ్రామంలో బీజేపీ మండల అధ్యక్షుడు నర్సింహ యాదవ్ ఆధ్వర్యంలో ఆయుష్మాన్‌భారత్ కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా నర్సింహయాదవ్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయుష్మాన్‌భారత్ కార్డు ద్వారా కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచిత వైద్యం పొందడం జరుగుతుందని ఆయన అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శివచారి, తిరుపతి, శ్రీనివాస్‌గౌడ్, శ్రీను, సురేష్‌చారి, చెన్నయ్య, నరేందర్‌రెడ్డి, వేణు, శ్రీశైలం, చంద్రయ్య పాల్గొన్నారు.

పన్నుల టార్గెట్‌ను పూర్తి చేయండి

మండల అభివృద్ధి అధికారి సంధ్య



మాట్లాడుతున్న అధికారి సంధ్య

మొయినాబాద్‌రూరల్: గ్రామాల్లో పన్నుల వసూళ్ల టార్గెట్‌ను సకాలంలో పూర్తి చేయాలని మండల అభివృద్ధి అధికారి సంధ్య, ఎంపీఓ వెంకటేశ్వర్‌రెడ్డిలు అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో పన్నుల వసూళ్లను వేగవంతం చేసి టార్గెట్‌ను పూర్తి చేయాలని తెలిపారు. అదే విధంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు ఎప్పటికప్పుడు నిర్వహించాలన్నారు. నర్సరీల్లో మొక్కలను జాగ్రత్తగా పెంచాలని తెలిపారు. గ్రామాల్లో ప్రతి రోజు పన్ను వసూళ్లల్లో ఇంటింటికి వెళ్లి వసూలు చేయాలని లేనిచో చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు సంధ్యరాణి, దీపలత, లావణ్య, వెంకటేశ్వర్‌రెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ద్వాదశ జ్యోతిర్లింగ మహా పడిపూజ



మొయినాబాద్: మహా పడిపూజలో పాల్గొన్న బక్కని నరసింహులు

షాద్‌నగర్‌రూరల్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామంలో బుధవారం శివ స్వాములు ద్వాదశ జ్యోతిర్లింగ మహాపడిపూజ ఘనంగా నిర్వహించారు. మహాపడిపూజకు గురుస్వామి కమ్మరిభూపాలాచారి హాజరై కార్యక్రమాన్ని నిర్వహించారు. మొగిలిగిద్ద గ్రామం శివనామ స్మరణతో మార్మోగింది. శివ భక్తులు భక్తిశ్రద్ధలతో శివనామ స్మరణ, భక్తిగీతాలు, భజనలు, సంకీర్తనలు ఆలపించారు. ఫరూఖ్‌నగర్ మండలంతో పాటుగా వివిధ మండలాల నుంచి శివభక్తులు పెద్ద ఎత్తును హాజరయ్యారు. అనంతరం శివస్వాములకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో శివభక్తులు, గ్రామపెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా జ్యోతిర్లింగ మహా పడిపూజ

మొయినాబాద్: మండలంలోని పెద్దమంగళారంలో శివస్వాములు జ్యోతిర్లింగాల మహా పడిపూజను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకం చేశారు. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నరసింహులు మహా పడిపూజలో పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ చేవెళ్ల పార్లమెంట్ నాయకులు సుభాష్‌యాదవ్, కొమ్మిడి వెంకట్‌రెడ్డి, పద్మారావు, భిక్షపతి, అశోక్, మాణిక్యం, రాఘవులు, రామేశ్వరావు, శేఖర్‌రెడ్డి, కిషోర్‌యాదవ్, జగదీష్‌రెడ్డి, దివాకర్, దుర్గారావు, ఆంజనేయులు పాల్గొన్నారు.

బీఎస్పీతోనే బహుజనుల అభివృద్ధి సాధ్యం

కొందుర్గు: బీఎస్పీ అధికారంలోకి వస్తేనే బహుజనుల అభివృద్ధి సాధ్యమవుతుందని బీఎస్పీ షాద్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గం ఉపాధ్యక్షుడు ప్రశాంత్ అన్నారు. బీసీల రిజర్వేషన్ 27 శాతం నుంచి 52 శాతానికి పెంచాలని డిమాండ్ చేస్తూ బుధవారం కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రశాంత్ మాట్లాడుతూ.. బీజేపీ, బీఆర్‌ఎస్ బీసీలను మోసం చేస్తూ, ఓటుబ్యాంక్ రాజకీయం చేస్తున్నాయన్నారు. దేశ జనాభాలో 52 శాతం ఉన్న బీసీలను కులాల పేరుతో విడగొడుతు మోసం చేస్తున్నారన్నారు. హక్కుల సాధనకోసం తిరుగుబాటు తప్పదని అన్నారు. కార్యక్రమంలో నాయకులు రాములు, శ్రీను, దర్శన్, శ్రీనివాసు, ఆనంద్, శ్రీకాంత్, ఆంజనేయులు, హర్షవర్ధన్, అశోక్ పాల్గొన్నారు.

సన్నగిల్లిన ఆశలు

- రుణమాఫీపై బడ్జెట్‌లో పూర్తిస్థాయి కేటాయింపులు కరువు
- రూ.90వేల లోపు ఉన్నవారికే మాఫీ
- నిరాశలో అన్నదాతలు



షాబాద్‌లో పత్తి పంటను సాగు చేస్తున్న రైతులు

షాబాద్: బడ్జెట్‌లో రుణమాఫీకి అవసరమైన నిధులు కేటాయింపులు జరపకపోవడంతో రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఏకకాలంలో రూ.లక్ష వరకు పంట రుణాలను మాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే, ఇప్పటి వరకు రూ.37 వేల లోపు రుణం ఉన్నవారికి మాత్రమే మాఫీ చేసింది. తాజాగా ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పూర్తిస్థాయిలో నిధులను కేటాయించకపోవడంతో అందరికి రుణ మాఫీ వర్తించే పరిస్థితి లేదు. నాలుగేళ్ల నుంచి రుణ మాఫీ కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వానికి ఇదే చివరి బడ్జెట్ అయినప్పటికీ నిధులే కేటాయించడంపై రైతుల్లో చర్చకు దారి తీసింది. రుణమాఫీ కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రైతులకు రూ.17,991 కోట్ల నిధులు అవసరం కాగా, కేవలం రూ.6,380 కోట్లను కేటాయించారు. ఈ నిధులతో రూ.90 వేల లోపు పంట రుణం పొందినవారికి మాఫీ చేస్తామని ప్రభుత్వం వెల్లడించింది. మెజార్టీ రైతులకు రూ.లక్షకు మించి రుణాలు ఉన్నాయి. రుణ పరిమితిని బ్యాంకర్లు పెంచడంతో ఒక్కో ఎకరానికి రూ. 50వేల నుంచి రూ. 80వేల వరకు పంట రుణాలు అందించారు. అనేక మంది రైతులకు రూ.3లక్షల వరకు పంట రుణాలు దక్కాయి. జిల్లాలోని 3,29,588 మంది రైతులకు రూ. 2,978 కోట్ల వరకు రుణాలు మాఫీ కావాల్సి ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం రుణమాఫీకి నిధులు పెంచాలని రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వ తీరు సరికాదు



రైతులకు పంట రుణాల మాఫీ కోసం తక్కువగా నిధులు కేటాయించారు. నాలుగేళ్ల నుంచి రుణ మాఫీపై ప్రభుత్వం దాటవేస్తూనే ఉంది. చివరి బడ్జెట్‌లోనూ ఈ తీరు సరికాదు.

–అంజయ్య, రైతు అంతిరెడ్డిగూడ, షాబాద్

రైతులు డిఫాల్టర్లుగా మారారు



పంటరుణాలను మాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో అనేక మంది రైతులు బ్యాంకుల్లో రుణాలను రెన్యూవల్ చేసుకోలేదు. ఫలితంగా బకాయిదారులుగా రైతులపై ముద్రపడింది. రైతులకు ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలి.

–పెంటయ్య, రైతు చర్లగూడ, షాబాద్ మండలం

గ్రామీణ రోడ్ల అభివృద్ధికి ప్రాధాన్యత

ఎంపీపీ గునుగుర్తి నక్షత్రం



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ నక్షత్రం, జెడ్పీటీసీ కాలె శ్రీకాంత్

మొయినాబాద్: గ్రామీణ రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని ఎంపీపీ గునుగుర్తి నక్షత్రం, జెడ్పీటీసీ కాలె శ్రీకాంత్ అన్నారు. మండల పరిధిలోని సురంగల్‌లో ఎమ్మెల్యే ప్రత్యేక నిధులు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు, గ్రామ పంచాయతీ నిధులు రూ.10 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను స్థానిక సర్పంచ్ లావణ్యతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అధిక వర్షాల వల్ల దెబ్బతిన్న గ్రామీణ రోడ్లను ప్రభుత్వం గుర్తించి అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తుందన్నారు. అందులో భాగంగానే సురంగల్ రోడ్డు పనులు జరుగుతున్నాయన్నారు. గ్రామ సమీపంలో తరచూ దెబ్బ తింటున్న రోడ్డుకు శాశ్వత పరిష్కారంగా సీసీ రోడ్డు నిర్మాణానికి పంచాయతీ నిధులు కేటాయించడంతో సర్పంచ్‌ను వారు అభినందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పద్మమ్మ, ఎంపీడీఓ సంధ్య, ఉపసర్పంచ్ యాదమ్మ, పీఆర్‌డీఈ విజయ్‌కుమార్, ఏఈ గోపాల్, ఎంపీఓ వెంకటేశ్వరరెడ్డి, పంచాయతీ కార్యదర్శి దీపలత, ఏఎంసీ వైస్ చైర్మన్ రవూఫ్, వార్డు సభ్యులు సుప్రియ, జయప్రద, భాస్కర్, మాధవి, ఇందిరమ్మ, ఎంపీ షఫీ, విక్రంరెడ్డి, నారాయణరెడ్డి, బీఆర్‌ఎస్ మండల ఉపాధ్యక్షుడు జయవంత్ తదితరులు పాల్గొన్నారు.

దృష్టి సమస్యల నివారణకే 'కంటి వెలుగు'

జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి

షాద్‌నగర్: గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న కంటి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కంటివెలుగు కార్యక్రమం చేపట్టిందని జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని చౌడమ్మగుట్ట తండాలో చేపట్టిన కంటి వెలుగు శిబిరాన్ని జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహ్మారెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండవ విడత కంటి వెలుగు శిబిరాలను అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కంటి పరీక్షలు చేసి, సమస్యలు ఉన్న వారిని గుర్తించి వారికి ఉచితంగా అద్దాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అందిస్తున్న ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ బాల్యానాయక్, ఎంపీటీసీ సభ్యుడు బద్దుల శివరాజ్ యాదవ్, నాయకులు రవి, డాక్టర్ స్రవంతి, వార్డు సభ్యుడు రామునాయక్, పంచాయతీ కార్యదర్శి జంగయ్య పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట

ఎమ్మెల్యే అంజయ్యయాదవ్



మున్సిపల్ కార్యాలయం భవనం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే, నాయకులు

షాద్‌నగర్: అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. రూ.5.90కోట్లతో నూతనంగా నిర్మించిన షాద్‌నగర్ మున్సిపల్ కార్యాలయం భవనాన్ని బుధవారం ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం పల్లెలు, పట్టణాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. ఇందుకు ప్రత్యేకంగా నిధులు మంజూరు చేస్తుందని తెలిపారు. సీఎం కేసీఆర్ దూరదృష్టితో ఆలోచిస్తూ పట్టణాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారని చెప్పారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలందరు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రం అభివృద్ధిలో నంబర్ వన్ స్థానంలో నిలిచిందని అన్నారు. అలాగే, షాద్‌నగర్‌ను అన్నిరంగాల్లో మరింత అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. నూతన భవనంలో వాస్తు పూజలు, హోమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే శంకర్‌రావు, జెడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఎంఎస్ నట్‌రాజన్, విశ్వం, కమిషనర్ వెంకన్న, నాయకులు నారాయణరెడ్డి, రామకృష్ణారెడ్డి, యుగేందర్, చింటు, సర్వర్‌పాషా, జూపల్లి కౌసల్య శంకర్, జమృద్‌ఖాన్, ఒగ్గుకిషోర్, వెంకట్‌రాంరెడ్డి, కృష్ణవేణి, శ్రీనివాస్‌గౌడ్, చెట్ల పావని తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఫుడ్ ఫెస్టివల్



వంటకాలను రుచి చూస్తున్న ప్రిన్సిపాల్

షాద్‌నగర్‌టౌన్: పట్టణంలోని గాంధీనగర్ కాలనీలో గల కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో బుధవారం ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ రకాల వంటకాలను తయారు చేసుకొని పాఠశాలకు తీసుకువచ్చారు. విద్యార్థులకు వంటల తయారీపై అవగాహన కల్పించి వాటి రుచులను తెలియజేసేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్ తెలిపారు. విద్యార్థులు తయారు చేసిన వంటకాల రుచి చూసిన ప్రిన్సిపాల్ విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



సమావేశంలో మాట్లాడుతున్న జంగారెడ్డి

డీఆర్‌డీఏ జిల్లా అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ జంగారెడ్డి

కేశంపేట: ప్రభుత్వ సహకారంతో మహిళలు ఆర్థికంగా ఎదగాలని డీఆర్‌డీఏ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ జంగారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మహిళ సమాఖ్య భవనంలో గ్రామ సంఘం అధ్యక్షులు, గ్రామ సంఘం సహాయకులతో ఏపీఎం భగవంతు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జంగారెడ్డి మాట్లాడుతూ.. మండలంలో కస్టమర్ హైరింగ్ సెంటర్‌లో అందుబాటులో ఉన్న పనిముట్లను, ట్రాక్టర్‌ను రైతులు అద్దెకు తీసుకునే విధంగా చూడాలన్నారు. గ్రామాల్లో సంఘాల పనితీరు బాగుండాలని ఆయన సూచించారు. గ్రామాల్లో సంఘాలు పటిష్టంగా ఉంటేనే మండల సంఘం ఉంటుందని చెప్పారు. స్త్రీనిధి ద్వారా తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సుదర్శన్, యాదగిరి, జంగయ్య, యాదయ్య, భాగలక్ష్మి, తిరుపతమ్మ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు ఘన సన్మానం



విద్యార్థినులను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

షాద్‌నగర్‌రూరల్: కృషి, పట్టుదల ఉంటే విజయాలు మీ వెంటే ఉంటాయని సాంఘిక సంక్షేమ కమ్మదనం గురుకుల బాలికల కళాశాల ప్రిన్సిపల్ విద్యుల్లత అన్నారు. జేఈఈ మెయిన్స్‌లో ఉత్తమ ఫలితాలను సాధించిన డి.పల్లవి, బి.పల్లవిని బుధవారం ప్రిన్సిపాల్ విద్యుల్లత ఆధ్వర్యంలో కేక్‌ను కట్ చేయించి పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం విద్యుల్లత మాట్లాడుతూ.. విద్యార్థినులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని పెట్టుకొని ఆ దిశ శ్రమించాలని సూచించారు. విషయ పరిజ్ఞానంతో కూడిన విద్యను అభ్యసించి ఉత్తమ ఫలితాలను సాధించాలని తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు అందుకొని మీరు ఎంచుకున్న రంగాల్లో స్థిరపడాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు ప్రణీత, హేమలత, శారద, జయలక్ష్మి, స్వర్ణమంజరి, శ్రీకాంత్, ఐలేష్, యాకూబ్, నర్సింహ్మాచారి తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఎంపీటీసీ మృతి

కొందుర్గు: గుండెపోటుతో వీరన్నపేట ఎంపీటీసీ మల్లయ్య మృతి చెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న మల్లయ్యకు మంగళవారం రాత్రి గుండెపోటు వచ్చింది. చికిత్స నిమిత్తం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందారు. బుధవారం స్వగ్రామం వీరన్నపేటలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌తో పాటు పలువురు నాయకులు హాజరై మల్లయ్య మృతికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.



గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న విశ్వేశ్వర్‌రెడ్డి

చేవెళ్ల: గ్రంథాలయాలు అభినవ దేవాలయాలని విద్యార్థులు పుస్తకాలు చదవడం అలవాటు చేసుకొని మంచి జ్ఞానం పొంది విజ్ఞాన వంతులుగా ఎదగాలని మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కందవాడ ప్రాథమిక పాఠశాలలో గ్రామ ఉప సర్పంచ్ గొండ్ల కావ్యకృష్ణగౌడ్ తన స్నేహితుడు వడ్ల హరీష్ చారి జ్ఞాపకార్థం గ్రంథాలయం ఏర్పాటు చేసి పుస్తకాలను అందజేశారు. ఈ గ్రంథాలయాన్ని బుధవారం మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బీజేపీ నాయకులు తూళ్ల వీరేందర్‌గౌడ్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్నేహితుడిపై ప్రేమతో ఈ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసిన కావ్యక్రిష్ణగౌడ్‌ను అభినందించారు.తన వంతుగా పాఠశాలలో ఏర్పాటు చేసిన గ్రంథాలయానికి కొన్ని పుస్తకాలు, అల్మారాను అందిస్తానని హామీ ఇచ్చారు. గ్రామానికి చెందిన కొంతమంది దాతలు విద్యార్థులకు బ్యాగులు, టైలు, బెల్టులను అందజేశారు. తూళ్ల వీరేందర్‌గౌడ్ చేతుల మీదుగా గ్రంథాలయంలోని పుస్తకాలను ప్రారంభించారు. దాత కావ్యక్రిష్ణగౌడ్ మాట్లాడుతూ.. పాఠశాలను అభివృద్ధి చేసుకోవాలని స్నేహితుడు వడ్ల హరీష్‌చారి ఉన్నప్పుడు ఆలోచించే వారమని స్నేహితుడిని గుర్తు చేసుకున్నారు. అందుకే పాఠశాలకు అతని జ్ఞాపకార్థం విద్యార్థులకు, యువకులకు ఎప్పుడు ఉపయోగపడే విధంగా ఉండాలని గ్రంథాలయం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కావ్యక్రిష్ణగౌడ్‌ను ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ అరుంధతిసాయిరెడ్డి, ఎంఈఓ అక్బర్, ఎస్‌ఎల్‌ఎస్ నోడల్ అధికారి సుభాస్ చంద్ర బోస్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు సునీల్‌కుమార్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ బల్వంత్‌రెడ్డి, నాయకులు సాయిరెడ్డి, రాఘవరెడ్డి, శంకర్, రవీందర్, ఉమశంకర్‌రెడ్డి, గుర్రాల శ్రీపాల్‌రెడ్డి, బాల్‌రెడ్డి, నరేశ్, విష్ణువర్ధన్‌రెడ్డి, శంకర్‌సింగ్,బీజేపీ నాయకులు కంజర్ల ప్రకాశ్, గ్రామస్తు లు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

శ్రమకు తగిన వేతనం ఇవ్వాలి

గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహారెడ్డి

కేశంపేట: గ్రామ పంచాయతీ కార్మికులకు పనికి తగిన వేతనం ఇవ్వాలని తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు టంగుటూరి నర్సింహారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాంచంద్రయ్య ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింహ్మారెడ్డి మాట్లాడుతూ.. పెరిగిన జనాభాకు అనుగుణంగా గ్రామ పంచాయతీల్లో సిబ్బందిని నియమించాలన్నారు. గ్రామ పంచాయతీ కార్మికులతో అనేక పనులను చేయిస్తూ వారికి ఫిక్స్‌డ్ వేతనాలను అందించడం లేదని ఆరోపించారు. కార్మికులకు పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీఓ శ్రీనివాసులుతో కలిసి మండల పరిషత్ కార్యాలయం వద్ద క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రవి, పద్మ, మల్లయ్య, జంగయ్య, పారేష, రోశయ్య, రామస్వామి, యాదమ్మ, రాంచంద్రి, సాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు రామస్వామి

చేవెళ్ల: అక్రమ అరెస్టలతో ఉద్యమాలను ఆపలేరని ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యుడు కె. రామస్వామి అన్నారు. బుధవారం ఏఐటీయుసీ, సీపీఐ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సెకండ్ ఏఎన్‌ఎంల సమస్యల పరిష్కారానికి తలపెట్టిన చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని పోలీసులు ముందస్తు అరెస్ట్‌లతో అడ్డుకున్నారని ఆరోపించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేసే సెకండ్ ఏఎన్‌ఎంల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా అరెస్ట్ చేయడం దుర్మార్గమన్నారు. ఏఐటీయూసీ నాయకుడి అరెస్టుకు మద్దతుగా సీపీఐ నాయకులు పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నాకు దిగారు. పోలీసులు అరెస్ట్ చేసిన వారిలో సీపీఐ నాయకులు సత్తిరెడ్డి సుధాకర్‌గౌడ్, మల్లేష్, మక్బుల్, మాధవి, మంజుల, శివయ్య, తదితరులు ఉన్నారు.

లోక్ అదాలత్‌లో 54 కేసుల పరిష్కారం

చేవెళ్ల: చేవెళ్ల కోర్టు ఆవరణలో జరుగుతున్న లోక్ అదాలత్‌లో బుధవారం 54 డంక్ అండ్ డ్రైవ్ కేసులు పరిష్కరించినట్లు రిటైర్డు జడ్జి సాంబశివరావు తెలిపారు. 2వ తేదీ నుంచి సాగుతున్న లోక్‌అదాలత్‌లో పెండింగ్‌లో ఉన్న ట్రాఫిక్ కేసులు పరిష్కారం అవుతున్నాయని చెప్పారు. బుధవారం 54 మద్యం సేవించి వాహనాలు నడిపించిన కేసులు, పెట్టి కేసులు 492 పరిష్కరించినట్లు చెప్పారు. ఈనెల 11వ తేదీ వరకు లోక్ అదాలత్ కొనసాగుతుందని ఇంకా పెండింగ్‌లో ఉన్న కేసు లకు సంబంధించిన వారు వెంటనే వచ్చి వాటిని పరిష్కరించుకోవాలని చెప్పారు. పెండింగ్ కేసులు ఉంటే వాహనదారులకు ఇబ్బందులు తప్పవని చెప్పారు. ప్రతి వాహనదారుడు ట్రా ఫిక్ రూల్స్ తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. లోక్ అదాలత్‌లో ట్రాఫిక్ ఏఎస్‌ఐ చందర్‌నాయక్, సిబ్బంది, పాల్గొన్నారు.

విద్యారంగాన్ని విస్మరించడం సరికాదు



ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న విద్యార్థులు

చేవెళ్ల: రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ సమావేశాల్లో విద్యారంగాన్ని విస్మరించిందని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి బి. శంకర్ అన్నారు. మండలకేంద్రంలో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు విద్యారంగానికి తక్కువ నిధులు కేటాయించినందుకు నిరసనగా బుధవారం విద్యార్థులతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించకపోగా కేవలం 6.57శాతం కేటాయించడం అన్యాయమన్నారు. విద్యను ఈ ప్రభుత్వం గాలికి వదిలేసిందని మండిపడ్డారు. గత బడ్జెట్‌లో 7.3 శాతం నిధులు కేటాయిస్తే ఈ బడ్జెట్‌లో దాన్ని కూడా తగ్గించారన్నారు. అరకొర బడ్జెట్‌తో విద్యారంగాన్ని ఏవిధంగా అమలు చేస్తారని ప్రశ్నించారు. విద్యారంగాన్ని కాపాడాల్సిన ప్రభుత్వం పూర్తిగా ప్రైవేటు, కార్పొరేట్ శక్తులకు అప్పనంగా అప్పజెప్పటానికి పూనుకుందన్నారు. పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులను చదువుకు దూరం చేసేందుకు కుట్ర చేస్తోందన్నారు. బడ్జెట్‌లో 30శాతం నిధులు విద్యారంగానికి కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో చేవెళ్ల డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు బి. అరుణ్‌కుమార్, ఎ. శ్రీనివాస్, నాయకులు రాములు, ప్రశాంత్, రాకేశ్, భాను, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు వైజ్ఞానిక రంగంలో రాణించాలి



ప్రశంసా పత్రాలు అందజేస్తున్న విజయలక్ష్మి

శంకర్‌పల్లి: విద్యార్థులు చదువుతో పాటు వైజ్ఞానిక రంగంలో రాణించాలని శంకర్‌పల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ సాత విజయలక్ష్మి పేర్కొన్నారు. గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌లో జరిగిన జాతీయ సైన్స్ కాంగ్రెస్ వైజ్ఞానిక ప్రదర్శనలో రూపొందించిన ఆటోమెటిక్ ఫర్టిలైజర్ డిస్పెన్సరీకి మొదటి బహుమతి లభించింది. దీంతో విద్యార్థులకు గోల్డ్‌మెడల్, ప్రశంసా పత్రాలను అందజేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులను ఆదర్శ పాఠశాల యాజమాన్యం అభినందించింది. కాగా, బుధవారం విద్యార్థులు ఆటోమెటిక్ ఫర్టిలైజర్ డిస్పెన్సరీ ప్రయోగాన్ని పాఠశాలలో మరోసారి ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వైజ్ఞానిక రంగంలో మరింత ముందుకు సాగాలని సూచించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రభుత్వ బడుల బలోపేతంతో పాటు వైజ్ఞానిక రంగానికి ప్రత్యేక చొరవ చూపడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ ఉమామహేశ్వర్‌రావు, వైస్ చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి, కౌన్సిలర్ శ్వేతపాండురంగారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శంకర్‌పల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ సాత విజయలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం శంకర్‌పల్లి జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో జిల్లా బీఆర్‌ఎస్‌వీ అధికార ప్రతినిధి కోమటిరెడ్డి లక్ష్మీనర్సింహారెడ్డి విద్యార్థినులకు ఉచితంగా పరీక్ష ప్యాడ్‌లు, స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి, మహాలింగపురం ఎంపీటీసీ యాదగిరి, నాయకులు హరీష్‌రెడ్డి, సంజయ్‌కుమార్, గోవర్ధన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.